# రాంబాబు కారు కొన్నాడు!

రాంబాబు కారు కొన్నాట్ట! కారు కొన్నాట్ట! అంటూ ఇరుగూ పొరుగూ తెగ చెప్పుకుంటున్నారు.

వనజకి భర్త కారు కొన్నందుకు సరదాగానే ఉంది కాని, తమ ఆర్థిక పరిస్థితినిబట్టి కొనకూడదు మరి. అది రాంబాబుకి తెలియక కాదు.ఆర్టీసీవాళ్ల సమ్మె మూలంగానూ, ఉన్న స్కూటరు రిపేరుకి వెళ్లి నెల రోజులయింది కనుకా కొనవలసిన పరిస్థితి వచ్చింది.రోజూ 'స్కూటరు బాగుచేసావా?' అని అడగడం "ఇంకా రిపేరు చేయలేదు రేపు రండి" అని కొట్టువాడి సమాధానంతో బాధతో, తన అసమర్థత మీద తనకే జాలేసింది.దాంతో వంట్లో నీరసం వచ్చింది.ఆపైన కోపం వచ్చి వళ్లు ఉడికిపోయింది. స్కూటర్‌కి రిపేరు, ఆర్టీసీ సమ్మె ఒక్కసారే రావాలా?తనఖర్మ కాకపోతేను.ఆఫీసులో తనకి ఎప్పుడో రావలసిన ప్రమోషన్ రావటం లేదు.దాంతో ఆఫీసుకి ఆటోలో వెడుతున్నాడు.రోజుకి వందరూపాయలదాకా అయిపోతోంది.రెండురోజులు ఎనిమిదిమంది వెళ్లే ఆటోలో వెళ్లాడు డబ్బు కలసివస్తుందని. మనుషుల్లో ఇరుక్కుపోయి పైగా చెమటకంపు భరించలేక డబ్బులు ఎక్కువైనా,ఒక్కడూ వెళ్లడంతో ఎక్కువ డబ్బు అయిపోతోంది.

జీవితంలో కొందరు కష్టజీవులుగానే పుడతారు...వేదాంతిలా ఆలోచించాడు రాంబాబు. అన్నయ్యగారి అబ్బాయి ఉద్యోగంలో జేరి ఆరునెల్లు అవలేదు.బ్యాంకులోన్ తీసుకుని కారు కొనేసాడు దర్జాగా.

తనూ ఉన్నాడు ఎందుకూ?గానుగెద్దు జీవితం..ఇల్లూ..ఆఫీసు.. ఓ కారా షికారా?ఇంక తన భార్యకు పాపం బి.ఎ. పాసైనా బియ్యం కడగడం తప్ప ఏంతెలీదు.

మళ్లీ మరో రోజునవెళ్లి, "నాస్కూటరు బాగుచేసావా "అని అడిగాడు కొట్టువాణ్ణి రాంబాబు.

"అయ్యా తమ స్కూటరుకి కొన్ని పార్ట్స్ పోయాయి.కొనాలి.బాగు చెయ్యాలి.అయినా ఇప్పుడప్పుడే అయ్యేపని కాదు. ప్రస్తుతం మా షాపులో రిపేరు చెయ్యవలసినవి చాలా వున్నాయి.పని కుర్రాళ్లు సరిగా రావడం లేదు.అందువల్ల మీ స్కూటరు ఇవ్వటం పడదు."అని ఖచ్చితంగా చెప్పేసాడు.

"అయ్యబాబోయ్ ఈ హైదరాబాదు పట్టణంలో సిటీ బస్సుల్లేక నాకు రోజుకి ఆటోకి బోల్డంత డబ్బు అయిపోతోంది."అని రాంబాబు భోరున ఏడ్చినంత పనిచేసాడు.
దాంతో కోపంగా అరిచాడు.
కొట్టువాడు ఒక్క చిరునవ్వు విసిరి రాంబాబుకి చిర్రెత్తించాడు.
దాంతో "కొత్త స్కూటరు కొనుక్కుంటానులే"అని అభిమానంతో అన్నాడు.
సరాసరి ఆ కోపంలో కొత్త స్కూటరుషాపుకి వెళ్లాడు.అక్కడ చాలామంది జనం వున్నారు, స్కూటర్లు కొనడానికి వచ్చినవాళ్లు.అయినా అందర్నీ తోసుకుని లోపలకు వెళ్లి,ఏకంపెనీది ఏరేటులో ఉందో కనుక్కున్నాడు.మంచిరంగు తనకి నచ్చిన రంగూ చూసి ఖరీదు అడిగాడు రాంబాబు.
రాంబాబు షాపులోకి వచ్చింది లగాయితూ ఒకతను అతణ్ణి అనుసరిస్తూ పరిశీలిస్తూ ఉన్నాడు.మనరాంబాబు అదేం గమనించే స్థితిలో లేడు.ఊరికే పూనకం వచ్చినవాడిలాగ ఏదో ఒకటి కొనెయ్యాలి అనే ఆవేశమే.
'ఇది కరెక్టు రేటు చెప్పండి సార్' అని అడిగితే ముప్ఫయినాలుగువేలు అన్నాడు షాపు యజమాని. ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు ఆ ఖరీదు విని. తను స్కూటరుకొన్నప్పుడు, పదివేలే కదా!ఇంతలోనే అంత ఖరీదు పెరిగిందా అనుకుని బాబిగాడు పుట్టినప్పుడు కొన్నాను.వాడికి ఎనిమిదేళ్లు కదా? అనుకుంటూ కుర్చీలోకూర్చుని, చెంపకిచెయ్యి ఆన్చుకుని, ఆలోచించసాగాడు.
ఇన్నాళ్లూ దాచిన డబ్బు బ్యాంకులో ఏభైవేలుదాకా వుంది.సరే కొనేద్దాం అని నిర్ధారణ చేసుకుని కుర్చీలోంచి లేవబోతూంటే రాంబాబుకి భార్య వనజ జ్ఞాపకం వచ్చింది.ఒకసారి ఇంటికి ఫోన్ చేసి భార్యతో మాట్లాడి మరీకొందామని కుర్చీలోంచి లేచి ఫోన్ దగ్గరకు వెళ్లబోతూంటే ఒక పెద్దమనిషి ఎదురై 'సార్' అన్నాడు."మీరెవరండీ"అన్నాడు రాంబాబు అతన్ని చూస్తూను.
"ఆ..మరేం లేదు. ఒకసారి ఇలా పక్కకు రండి. మీతో మాట్లాడే పనుంది"అన్నాడు చాలా వినయంగా.పాపం ఎందుకో పిలుస్తున్నాడు వెళితే ఏం పోయింది అనుకుని అతనితో షాపు బయటకు వెళ్లాడు.
"సార్! నాపేరు శివా అంటారు' అని అతనిపేరు చెప్పాడు.
ఇంకా ఈ లోకంలో ఇంతమంచివాళ్లు ఉన్నారు కాబోలు అనుకుని "అలాగాండీ

నాపేరు రాంబాబు''అన్నాడు.
ఇద్దరూ షాపు దాటి బయటకి వచ్చాక "రాంబాబు గారూ!మీకు అభ్యంతరం లేకపోతే పక్కనున్న కేంటీన్‌కి వెళదాం రండి. సందేహిస్తారేం? నేను మరోలాంటివాణ్ణికాదు. నాకూ పెళ్లాంబిడ్డలున్నారు''అన్నాడు.
"భలేవారే అంతలా చెప్పాలా, మీలాంటి మంచిమనుషుల్ని చూస్తేనే ఆనందం కలుగుతుంది.''అన్నాడు రాంబాబు.
ఇద్దరూ వేడివేడికాఫీ సేవిస్తూ మాట్లాడుకోసాగారు.
"మీరు ఎందులో పని చేస్తున్నారు?''అడిగాడు శివా.
"నేను ఒక ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాను.''అన్నాడు రాంబాబు.
శివా "అల్లాగా''అంటూ చిరునవ్వుతో తల పంకించి "బిల్లు నేను ఇస్తాను సార్''అంటూ ఇచ్చేసాడు స్టయిల్‌గా.
"ఇంక నేను వెళ్లాలి.నా భార్యకి ఫోన్ చెయ్యాలి స్కూటర్ సంగతి.''అన్నాడు రాంబాబు.
"ఇందాకటినుంచి నేను పరిశీలిస్తున్నాను.మీరు నన్ను గమనించలేదు కాని.'' పకపక నవ్వాడు శివా.
"నేను వచ్చినపనేమిటో నా గొడవ ఏమిటో అదేగాని ఇలాంటివన్నీ నాకు పట్టవు.''అన్నాడు రాంబాబు.
శివా అతని కేసి చూసి, "ఒక్క మాట చెప్పనా?''అన్నాడు.
"చెప్పండి''అన్నట్లు తల ఊపాడు రాంబాబు.
"అయితే మీరిప్పుడు ముప్పయి నాలుగు వేలు పెట్టి స్కూటరు కొనడం కంటే నా దగ్గర మంచి కారు వుంది కొనొచ్చునుకదా?''అన్నాడు.
మళ్లీ చెప్పడం మొదలెట్టాడు.''మీరూ మీ ఫామిలీ సరదాగా సాయంకాలం షికారుకెళ్లొచ్చును.మీరు ఆఫీసుకి కార్లో వెడితే దర్జాగా ఉంటుంది. స్కూటరు కొంటే కన్న పదహారువేలు ఎక్కువ అంతేకదా?''
శివా మాటలు వింటూంటే నిజంగానే కారు అన్నివిధాలా బాగుంటుంది స్కూటరు కన్నా కారు సేఫ్.అయినా అంత డబ్బు నాదగ్గర ఎక్కడ వుంది. ఆ ఫిక్స్‌డ్‌డిపాజిట్‌లో ఉన్న యాభై వేలూ తీసెయ్యాలి.డబ్బుకూ సంతోషానికీ ముడిపెట్టాడు దేముడు అనుకుని

"సరే పదండి కారు చూద్దాం" అని శివాతో అన్నాడు.

"కారుచూస్తే బాగానేవుంది మరి.ఇది కొన్నది లగాయితు పెట్రోలు ఖర్చు పెరుగుతుంది" అన్నాడు.

"భలేవారే కార్లో కూచోండి ఒక రౌండ్ తిప్పుతాను"అన్నాడు శివా.

రాంబాబుకి కార్లో వెళుతూంటే, కళ్లు ఆనందంతో మెరిసాయి.మనసులో ఉత్సాహం మరింత అయింది.

శివా రాంబాబుని కనిపెట్టేసాడు కొనేటట్టు ఉన్నాడని.

"మీలాంటివారు యాభైవేల కోసం,అంత కంగారుపడతారేంటండీ?మీరు ఎలాగూ స్కూటరు కొందామనుకుంటున్నారు.ఇంకో పదిహేనువేలు అంతే కదా!"అన్నాడు.

రాంబాబుని ఆలోచించుకోనివ్వకుండా తొందరపెట్టేసాడు  మాటలతో.

"మీరు అన్నరేటుకి అయిదు ఆరు వేలు తగ్గిస్తే బాగుంటుంది" అన్నాడు రాంబాబు.

"దానికేముంది అలాగే"అన్నాడు శివా.

"సరే అయితే. నాకు డ్రైవింగ్ రాదు నేర్చుకోవాలి."అన్నాడు రాంబాబు.

"స్కూటరు నడిపేవాడికి కారు నడపటం నాలుగు రోజుల్లో వస్తుంది. మీకు డ్రైవింగ్ లైసెన్స్ నేను ఒక్క రోజులో ఇప్పిస్తాను. ఆతర్వాత కొన్నాళ్లు 'ఎల్' బోర్డు పెట్టుకుని నడిపేయండి"అని హుషారుగా చెప్పేసాడు శివా.

"అయితే తిన్నగా ఇంటికి వెడదాం"అని నల్లకుంటకి  దారిచూపించాడు.

"ఇదే మాఇల్లు ఇక్కడ ఆపండి" అని ఇద్దరూ ఇంట్లోకి వెళ్లారు.

శివాని భార్య వనజకి పరిచయం చేసాడు.

"మనగుమ్మంలో అగినకారు వీరి దగ్గర నేను కొన్నాను. అన్నీ మాట్లాడేసాను."అన్నాడు చాలాసీరియస్‌గా ముఖం పెట్టి.

"అలాగా బాగుంది. నమస్కారమండీ"అంది శివాని ఉద్దేశించి.అతను ప్రతి నమస్కారం చేసాడు.

రాంబాబు "మా ఇద్దరికీ మంచి కాఫీ పట్రా."అన్నాడు.

"సరే,అలాగే. ఓసారి ఇలా వస్తారా?"అన్నట్లు కళ్లతో సంజ్ఞ చేసింది వనజ.

పెద్ద మనిషితో మాట్లాడుతోంటే నేను లోపలికి రావడం బాగుండదుఅన్నట్లు కళ్లతోనే సమాధానం చెప్పాడు.శివా అంతా గమనించాడు గానీ గమనించనట్లు అక్కడే వున్న

పేపరు తిరగేస్తున్నాడు.
వనజ కాఫీ పట్టుకొచ్చి వెళ్లిపోయింది కోపంగా.
"శివా మీరునాలుగు రోజులు దాకా కారు అలవాటయ్యేదాకా వస్తూండాలి"అన్నాడు.
"అలాగే తప్పకుండాను.కాని నాకు మీరు కేష్ రూపంలోనే ఇవ్వాలి."అన్నాడు.
"ఓ యస్.అలాగే.రేపే బ్యాంకులోంచి తీసి ఇస్తా" అని రాంబాబు ఒప్పుకున్నాడు.
శివా వెళ్లిపోయాడు మర్నాడు ఎనిమిదింటికల్లా వస్తానని చెప్పి.
"గుమ్మంలో కారుంటే ఎంత స్టయిల్ వచ్చిందో మనింటికి."అన్నాడు భార్యతో రాంబాబు.
"మనకి కారు ఉండడం అవసరమంటారా"అంది భయపడుతూనే దిగులుగా ముఖం పెట్టి వనజ.
"భలేదానివే అలా అంటావేమిటీ?నిన్నమొన్నఉద్యోగంలో చేరిన మా అన్నయ్య కొడుకు కొన్నాడు.ఇదేం పెద్ద ఖరీదు కాదు.యాభైవేలకు ఇంత మంచి కారు వచ్చిందంటే మనజాతకంలో రాజయోగం ఉండి వచ్చింది.పైగా అతనంతట అతను వచ్చి అడిగాడు.నేను స్కూటరు కొందామని వెళితేను, అక్కడ తటస్థ పడ్డాడు."
"యాభైవేలు పెట్టి కొనేటప్పుడు మెకానిక్‌కి చూపించకపోయారా?"అంది వనజ.
"ఈరోజుల్లో మెకానిక్‌ని నమ్మకూడదే!నేనుకారు చవకగా కొంటున్నానని తెలిసి వెధవ అనుమానాలన్నీ పెడతాడు.వాడు స్కూటరుకి ఎంత ఏడిపించాడనీ.అతనిమీద కోపంతో స్కూటర కొందామని వెళ్లాను శివా అక్కడకి దేముళ్లాగ వచ్చాడు.నువ్వేం మాట్లాడకు.వెళ్లు అవతలికి.అన్నం వడ్డించు.ఆర్టీసీ స్ట్రైక్ ఎన్నాళ్లైనా ఉండనీ, స్కూటరు ఎప్పటికేనా బాగు చెయ్యనీ.నాకేం భయం లేదు.హాయిగా కారులో వెళ్లి వస్తాను."అన్నాడు రాంబాబు ధీమాగా.
వీధిలోని పిల్లలందర్నీ తీసుకొచ్చి "మా నాన్నకారు కొన్నాడోయ్ "అంటూ బాబిగాడు,శశి గెంతుతున్నారు చేతులు గాలిలోకి ఎత్తుతూను.
వనజకి ఇదంతా అయోమయంగా వుంది.
"మనకి కారు ఎందుకండీ"అంది మెల్లగా.
"అదిగో అదే అనొద్దు అన్నాను.జీవితంలో కొన్ని మంచి అవకాశాలు వస్తాయి.అప్పుడే మనం వాటిని పట్టుకోవాలి.తెలిసిందా?పిల్లల్ని కాన్వెంటుకి దిగబెట్టి అప్పుడు ఆఫీసుకి

వెళతాను.సరదాగా సాయంకాలం రవీంద్రభారతికి పిల్లల్ని తీసుకుని వెడదాం" అని భార్యని ఒప్పించాడు.ఇంకా ఎక్కువగా అంటే భర్త బాధపడతాడని,సరేననిఒప్పుకుంది వనజ వాగ్వివాదం రాకుండాను.

"నిజమే ఎప్పుడూ పొదుపు పొదుపు అనుకుంటూ బ్రతకడమేకదా?మనం పొదుపు చేసి దాచుకున్నాం కనుకనే ఇవాళ కారు కొనుక్కున్నాం.ఎప్పుడూ ఊహా లోకాల్లో తేలిపోవడమే కదా!సరదాగా సాయంకాలం కారులో షికారు పోవచ్చును."అనుకుంది వనజ.

అనుకున్న ప్రకారం శివా వచ్చి కారులో ఆఫీసుకి రాంబాబుని తీసుకెళ్లాడు.సాయంకాలం వచ్చి మిమ్మల్ని ఇంటి దగ్గర దిగబెడతాను"అన్నాడు.

బ్యాంకులో ఫిక్సడ్ డిపాజిట్‌లోంచి యాభైవేలూతీసి ఉంచాడు.లంచ్ అవర్‌లో కారుకథ అందరికీ కాకపోయినా కొందరికి చెప్పాడు, కారులో దిగావేమిటీ అని ఎవరూ అడక్కపోయినా.

అంతా విని ఫ్రెండ్స్"భలే భాన్సు కొట్టేసావే! కారు కొన్నందుకు పార్టీ ఇవ్వాలి"అని కొందరు, "అబ్బే డిన్నర్ " అని మరికొందరు.

"ఓ అలాగే"అంటూ ఉబ్బితబ్బిబ్బైపోయాడు.డబ్భయివేలు అని అందరికీ చెప్పాడు. ఆహా అన్నారు నోరుతెరిచి.

మరేమిటి అనుకున్నారు అన్నట్లు చూసి, క్రాఫ్ సర్దుకుంటూ దిలీప్‌కుమార్‌లా నవ్వాడు.

అనుకున్న ప్రకారం నలభైఅయిదువేలూ శివాకి ఇచ్చేసాడు.శివా రాంబాబు పేర లైసెన్సు డబ్బులిచ్చి కొని పట్టుకొచ్చి యిచ్చాడు.స్కూటరునడపటం అలవాటే కనుక డ్రైవింగ్ తొందరలోనే వచ్చింది.

"కారు కొంచెం బడబడ శబ్దం అవుతోందేమిటి?"అని శివానడిగితే,"ఇంజన్ వేడెక్కితే ఏకారేనా శబ్దం చేస్తుంది. ఏం భయం లేదు. కార్లో రెండు నీళ్ల బాటిల్స్ పెట్టుకుని ఇంజన్‌మీద పోస్తే సరిపోతుంది"అన్నాడు.

"అయితే తరచు దాహం వేస్తుందన్నమాట కారుకి"అని తేలిగ్గా తీసిపారేసాడు రాంబాబు.

శివా చెప్పినట్లుగా తరచుగా ఇంజన్ వేడెక్కినప్పుడల్లా బడబడశబ్దం వస్తోంది. వెంటనే కారు ఆపి నీళ్లు పోస్తున్నాడు.మనిషన్నాక జలుబు తలనెప్పి వచ్చినట్టే కారుకీను

అనుకున్నాడు రాంబాబు.

కారు కొన్న నాలుగు రోజులకే పెట్రోలు ధర పెరిగిందని పేపరులో ప్రకటన చూసాడు.వెంటనే గుండె దడదడ కొట్టుకుంది.

వెంటనే భార్య వనజని పిలిచి,"రేపటినుంచి ఒక లీటరు పాలే కొను.పిచ్చిగా వీధిలోకి వచ్చిన కూరలు అవీ కొనకు.పేపరు మానేద్దాం.రేడియోలోనూ టీవీలోనూ వార్తలు ఎలాగూ వింటాం కదా"అన్నాడు.

"అలా తెల్లబోతావేం?చెప్పినట్టు చెయ్యి"అని శాసనం చేసాడు.

"ఉదయం చేసిన కూరో,చారో రాత్రికి చాలు.ఊరికే ఇంతింత నూనె పోసి వేపుళ్లు వేయించడం మానెయ్యి.నెయ్యికూడా మానెయ్యి."అన్నాడు.

అంతా విని తలాడించింది వనజ చిన్నబోయిన మనసుతో.రాంబాబు చాలా గట్టిగా హుకుం జారీ చేసాక అన్నిమాటలకీ తలవంచింది.

బాబిగాడికీ శశికీ వీధిలో పిల్లలందరిలోనూ కొంచెం హోదా పెరిగినట్టు అనుకుంటున్నారు.

"మీకేమమ్మా కారు కొనుక్కున్నారు"అని ఇరుగూపొరుగూ పొగుడుతూంటే, వనజ ఆ మాటలకి సుతారంగా నవ్వి వయ్యారంగా కులుకుతూ చూస్తోంది.

రాంబాబు తరచుగా, కారు నడపడంతో పిల్లల్నీ భార్యనీ తీసుకుని సరదాగా డ్రైవ్ చేస్తూ ఊర్లో చుట్టాలింటికీ, స్నేహితులింటికీ తిప్పుతున్నాడు.

తరచు ఇంజన్ వేడెక్కి బడబడలాడుతోంది.నీళ్లు పోసినా లాభంలేక నడిరోడ్డుమీద ఆగిపోతోంది.మళ్లీ స్టార్ట్ చేయడానికి నానా అవస్థా అవుతోంది.

ఇదిచూసి స్కూటర్‌వాళ్లూ ఆటోల వాళ్లూ "నీ మూలాన ట్రాఫిక్ ఆగిపోతోంది.ఒకసారి మెకానిక్‌కి చూపించకూడదూ"అన్నారు.

అవును నిజమేనని షాపులో చూపించాడు.

అతను మిషను పరిశీలించి,"ఇది బాగుచెయ్యడానికి పదిరోజులు పడుతుంది.కొన్ని పార్ట్స్‌కొనాలి. అడ్వాన్స్ రెండు వేలు,రిపేరు చేసినందుకు రెండువేలు తే"అన్నాడు దర్జాగా కుర్చీలో కూర్చుని.

ఆ మాటలు రాంబాబుకి అశనిపాతంలా తగిలాయి.కారు సరదాపడినంతసేపు పట్టలేదు.ఇంక వీడికి ఇలానెలనెలా ముడుపు చెల్లించాలికాబోలురా భగవంతుడా అని

గిజగిజలాడాడు.సరేఅని కారుని రిపేరుషాపులో వదిలేసి,వెనక్కి తిరిగి బేలగా ఒక్కసారి చూసి మరీ కాలు కదిపాడు.మెల్లగా నడుచుకుంటూ వచ్చి పోనీ స్కూటరు బాగైందేమోనని అడిగాడు."ఇవిగో చక్రాలూ సీటూ విప్పాను.ఇంకా బాగవలేదు" అన్నాడు.

అడుగులు లెక్క పెట్టుకుంటూ బ్యాంకు బాలన్స్ఖర్చు అయిపోయినందుకు దిగాలుగా ఇంటికి వచ్చాడు రాంబాబు.

"నాన్నా కారేదీ?"అని పిల్లలూ, భార్య వనజా అడిగారు.

నామీద వాళ్లకి దృష్టిలేదు.వాళ్లు కారు అడుగుతారు అని కోపం వచ్చి "కారు నమిలి మింగేసాను"అన్నాడు.

భార్య అర్థంచేసుకుని "రిపేరుకి ఇచ్చారా పోనీలెండి బాధపడకండి.ఆర్టీసీవాళ్లు సమ్మె విరమించుకున్నారట"అని ధైర్యం చెప్పింది.

"ఆర్టీసీ సమ్మె ఐపోయింది. డబ్బు పోయింది.కారు మిగిలింది..అదీ రిపేర్ షెడ్‌లో...ఆపరేషన్ బెడ్‌మీద పేషంటులా"

❄❄❄